వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, ఆగస్టు 06, 2026

# ఉద్యమ కెరటం ఆచార్య జయశంకర్ సార్

## ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ సిద్ధాంతకర్త, స్వరాష్ట్ర భావజాల వ్యాప్తి కోసం జీవితాన్ని అర్పించిన ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతి వేడుకలను వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ అంజమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటూ ఏనాడు పదవులు, వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించలేదు. తెలంగాణ సమాజం పడుతున్న కష్టమే తన కష్టంగా భావించి 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో ప్రాంతీయ అసమానతలపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రజలకు వివరించారు. చివరి శ్వాస వరకు ఉద్యమ రథాన్ని నడిపించి, స్వరాష్ట్రం చూడకుండానే 2011 జూన్ 21న కన్నుమూశారు. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి అగ్రికల్చరల్ యూనివర్సిటీకి, భూపాలపల్లి జిల్లాకు ఆయన పేరును పెట్టి గౌరవించుకుంది. అలాగే బడిబాట కార్యక్రమానికి 'జయశంకర్ బడిబాట'గా నామకరణం చేసింది. ఆయన ఆశయాలను, ఆలోచనలను భావితరాలకు అందించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడీ ఉపాధ్యాయులు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఆస్పత్రికి వచ్చిన తల్లి ఆపద్బాంధవుడిగా నిలిచిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అర్ధరాత్రి వేళ.. నాలుగు నెలల పసికందు అనారోగ్యంతో అల్లాడిపోతుంటే, దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రికి పరుగులు తీసిన ఓ నిస్సహాయ తల్లికి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. అర్ధరాత్రి ఆస్పత్రి ఆవరణలో కన్నీరుమున్నీరవుతున్న ఆ తల్లికి ధైర్యం చెప్పడమే కాకుండా, స్వయంగా తన కారులో ఎక్కించుకుని వైద్యం అందించేలా చేసిన వైనం స్థానికంగా చర్చనీయాంశమైంది.

### అర్ధరాత్రి ఆందోళన.. ఆటో ప్రయాణం..

సంగారెడ్డికి చెందిన ప్రవళిక ఇంటి వద్ద నాలుగు నెలల చిన్నారి అప్పటివరకు ప్రశాంతంగానే ఉంది. ఒక్కసారిగా పాపకు ఫిట్స్ (అస్మర్క సంక్షోభం) వచ్చి చలనం లేకుండా ఉలుకూ



పలుకూ లేకుండా పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న అత్తామామలు అనారోగ్యంతో మంచాన పడి ఉండగా, డ్రైవర్గా పనిచేస్తున్న భర్తకు ఫోన్ చేస్తే ఎలాంటి స్పందన లేదు. ఒంటరిగా బిడ్డను పట్టుకుని ఏం చేయాలో తోచని స్థితిలో భయపడిపోయిన ఆ తల్లి.. రాపిడో ఆటో ద్వారా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుంది. ఏ వార్డుకు వెళ్లాలో తెలియక ఆస్పత్రి గేటు దగ్గరి మహిళల వార్డు ప్రాంగణంలో బిడ్డను ఎత్తుకుని నిలబడిపోయింది.

### అకస్మాత్తుగా వచ్చి అండగా నిలిచిన జగ్గారెడ్డి

అదే సమయంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేయడానికి జగ్గారెడ్డి వచ్చారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలిస్తూ డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న ఆయన కంట పసికందును ఎత్తుకుని తీవ్ర వేదనతో నిలబడిన ప్రవళిక పడింది. వెంటనే ఆమె దగ్గరకు వెళ్లి "ఏమైందమ్మా?" అంటూ ఆప్యాయంగా పలకరించారు. తన బిడ్డ చాలా సేపటి నుంచి ఉలుకూ పలుకూ లేకుండా ఉందని, ఒంటరిగా రాత్రి పూట ఆస్పత్రికి వచ్చానని ఆమె తన గోడును వెళ్లబోసుకుంది.

### కారులో ఎంసీహెచ్‌కు తరలింపు.. తక్షణ వైద్యం

తల్లి పడుతున్న వేదనను అర్థం చేసుకున్న



జగ్గారెడ్డి వెంటనే చొరవ తీసుకున్నారు. ప్రవళికను, అనారోగ్యంతో ఉన్న పసికందును తన కారులో ఎక్కించుకుని ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనానికి స్వయంగా తీసుకెళ్లారు. అక్కడి నుంచి రెండో అంతస్తులోని పసిపిల్లల వార్డుకు వెళ్లి డాక్టర్లకు పాప ఆరోగ్య పరిస్థితిని వివరించారు. వెంటనే చికిత్స ప్రారంభించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యులు తక్షణమే స్పందించి పాపకు పరీక్షలు నిర్వహించగా.. వేసిన వ్యాక్సిన్ ప్రభావం వల్ల ఫిట్స్ వచ్చినట్లు గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించారు. ఆ సమయంలో బయట ఉన్న ప్రవళిక భర్తతోనూ జగ్గారెడ్డి ఫోన్లో మాట్లాడి, పాపకు చికిత్స ప్రారంభమైందని, వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. అర్ధరాత్రి వేళ ఆపదలో ఉన్న తల్లీబిడ్డలకు అండగా నిలిచి ప్రాణాలు కాపాడిన జగ్గారెడ్డి చొరవపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# అమెరికా వేదికపై ఒగ్గుకథా వైభవం

- ఆకట్టుకున్న ఏడు అంతరాల బోనం
- తెలంగాణ జానపద కళారూపం

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఒగ్గుకథకు అమెరికా వేదికపై ఆదరణ లభించింది. అమెరికాలోని ఓక్లాండ్ అరెనాలో సిలికానాంధ్ర రజతోత్సవంలో సోమవారం మిద్దె రాములు మనుమడు మిద్దె వినీత్ తన ఒగ్గు కథ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఒగ్గు కథను, సంప్రదాయ సంగీతం, నృత్య విన్యా సాలతో వినూత్నంగా ఆవి ష్కరించారు. ఏడు అంతరాల బోనం ప్రదర్శనతో ఓక్లాండ్ అరెనా దద్దరిల్లింది. వేలాది మంది తెలుగు ప్రేక్షకులు హర్షధ్వానాలతో కళాకారులను అభినందిం చారు. సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్య క్షుడు కూచిభొట్ల ఆనంద్ ప్రత్యేక ఆహ్వానం మేర కు ఈ ప్రదర్శనకు అవకాశం లభించిందని వినీత్ తెలిపారు. తెలంగాణ గ్రామీణ కళారూపాన్ని అమెరికాలోని తెలుగు ప్రజలకు పరిచయం

చేసేందుకు తనకు, తన తండ్రి మిద్దె పరశురాములుకు అవకాశం కల్పిం చిన కూచిభొట్ల ఆనంద్కు, సిలికానాంధ్ర సభ్యులకు, తెలంగాణ ఒగ్గు కథ కళాకారులకు, కవులకు, మిద్దె రాములు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



# వాస్క్యులార్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



- డాక్టర్ శేఖర్ రెడ్డి
- ఘనంగా నేషనల్ వాస్క్యులార్ డే
- హనుమకొండలో ప్రత్యేక వైద్య శిబిరం

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నేషనల్ వాస్క్యులార్ డే సందర్భంగా హన్మకొండ జిల్లా కాకాజీ కాలనీలోని రక్షిత్ హాస్పిటల్లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న వాస్క్యులార్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హైదరాబాద్ బేగంపేట కిమ్స్ సన్షైన్ హాస్పిటల్ వాస్క్యులార్ సర్జన్ డాక్టర్ శేఖర్ రెడ్డి తెలిపారు. ప్రధాన లక్షణాలు: కాళ్లలో నొప్పితో కూడిన తిమ్మిర్లు, నడిచినప్పుడు నొప్పి రావడం, విశ్రాంతి తీసుకున్న తర్వాత నొప్పి తగ్గడం, పాదాల్లో పుండ్లు ఏర్పడటం, చర్మం రంగులో మార్పులు రావడం, కాలు వాపు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వాస్క్యులార్ సర్జన్ను సంప్రదించాలి. కొన్ని రక్తనాళాల సమస్యల్లో, ముఖ్యంగా స్ట్రోక్ వంటి తీవ్రమైన ముప్పు వచ్చే వరకు ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు కాబట్టి ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం ఈ వ్యాధులకు ఎన్నో ఆధునిక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వ్యాధి నిర్ధారణలో ఆలస్యం చేస్తే మాత్రం కొన్ని సందర్భాల్లో కాలు తొలగించాల్సిన ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందని డాక్టర్ శేఖర్ రెడ్డి హెచ్చరించారు.

రక్షిత్ హాస్పిటల్ జనరల్ సర్జన్ డాక్టర్ అశ్విత్ రెడ్డి మాట్లాడుతూ.. నేషనల్ వాస్క్యులార్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో 30 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. రోగులకు వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన నివారణ చర్యలు, అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య సేవలపై పూర్తి అవగాహన కల్పించారు. సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాంతక సమస్యలను నివారించవచ్చని వైద్యులు సూచించారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
గురువారం, ఆగస్టు 06, 2026

# సామాజిక న్యాయ తెలంగాణ సాధనే ధ్యేయం

## టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత





**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సామాజిక న్యాయ తెలంగాణ సాధనే ధ్యేయంగా సరూర్‌నగర్ వేదికగా నిర్వహించిన 'సామాజిక న్యాయ సంకల్ప సభ' దేశంలోని కోట్ల మంది జీవితాల్లో మార్పు తీసుకురానుందని టీఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ సభలో ఆమె ఉద్వేగభరితంగా ప్రసంగిస్తూ.. కులవివక్షను రూపుమాపేందుకు, అన్ని వర్గాలకు సమన్యాయం జరిగే వరకు తన జీవితాన్ని అంకితం చేస్తానని ప్రకటించారు. "నేను బీసీల కోసం మాట్లాడితే అగ్రవర్ణంలో పుట్టి నీకెందుకు అని చాలామంది హేళన చేస్తారు. నా పుట్టుక నా చేతుల్లో లేదు, కానీ నేను ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకోవడం మాత్రం నా చేతుల్లోనే ఉంది" అని కవిత స్పష్టం చేశారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు విశ్రమించకుండా పోరాడుతామన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల లోపు బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వెయ్యి కార్లతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సామాజిక న్యాయం అంటే అగ్రవర్ణాల సీట్లు పోతాయని భయపడుతుంటారని, కానీ చరిత్రలో గౌతమ బుద్ధుడు, సాహూ మహారాజ్, వి.పి. సింగ్, జయలలిత లాంటి అగ్రకుల ప్రముఖులే సమాజంలో విప్లవాత్మక మార్పులకు, రిజర్వేషన్లకు బాటలు వేయడాన్ని ఆమె గుర్తుచేశారు. చట్టసభల్లో బీసీలకు సపరేట్ కోటా కింద 50 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమం. మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతులకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలి. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు 'పద్మవిభూషణ్' ప్రకటించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడంతో పాటు, ట్యాంక్ బండ్పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి. ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక నిధులను కేవలం వారి అభ్యున్నతి కోసమే పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అడవులపై ఆదివాసీలకు సంపూర్ణ హక్కులు కల్పించాలి. డీలిమిటేషన్ ప్రక్రియతో సంబంధం లేకుండా చట్టసభల్లో మహిళలకు వెంటనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. ముస్లింలకు ఆర్థిక స్వావలంబనతో పాటు హక్కులతో కూడిన రిజర్వేషన్లు, వక్ఫ్ బోర్డు చట్టం తేవాలి. సిక్కులు, క్రిస్టియన్లకు ప్రత్యేక ఆర్థిక భద్రత కల్పించాలి. ట్రాన్స్‌జెండర్లకు సంపూర్ణ హక్కులు ఇవ్వాలి. వికలాంగుల పెన్షన్లు పెంచి, కో-ఆప్షన్ సభ్యులలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

# ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ సిద్ధాంతకర్త, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని సికింద్రాబాద్‌లో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి, స్వాభిమాన సాధన కోసం జయశంకర్ తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేశారని డా. శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను గణాంకాలు, పరిశోధనలు, వాస్తవ ఆధారాలతో వివరించి ఉద్యమానికి బలమైన దిశానిర్దేశం చేశారన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ భాషల్లో అపారమైన ప్రావీణ్యం ఉన్న ఆయన.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై అనేక పుస్తకాలు రచించారని, ఆ రచనలు ఉద్యమకారులకు, యువతకు ఎంతో మార్గదర్శకంగా నిలిచాయని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైద్య మరియు ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, రాష్ట్రం 'ఆరోగ్య తెలంగాణ' దిశగా వేగంగా పయనిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. చల్లా దేవి (జిల్లా టీబీ అధికారి), డా. అనిత (అదనపు జిల్లా వైద్యాధికారి), డా. శ్రీధర్ (జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి), డాక్టర్ సరస్వతి (ప్రోగ్రామ్ ఆఫీసర్), డా.సాయి బాబా (సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్), జక్కుల రాములు (జిల్లా మీడియా అధికారి), లక్ష్మి ప్రియాంక (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), ఆంజనేయులు (మలేరియా అధికారి), తదితర కార్యాలయ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని జయశంకర్ ఆశయాలను స్మరించుకున్నారు.



# తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్

## ఘన నివాళులు అర్పించిన ప్రముఖులు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం, తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలోని పీవీ నరసింహారావు హాల్‌లో ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆచార్య జయశంకర్ జీవితాంతం అహర్నిశలు చేసిన అపూర్వ సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# రాబోయే తరాల భవిష్యత్తును నాశనం చేయొద్దు

- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి
- పాఠశాలల కుదింపు దుర్మార్గం
- ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే ఎన్నికల గురించి నిత్యం మాట్లాడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. రాబోయే తరాల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్రంలో విద్యా వ్యవస్థ క్షీణిస్తున్న తీరు, పాఠశాలల మూసివేత ప్రకటన, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విద్యపై అత్యల్ప ఖర్చు: ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం తెలంగాణలో విద్యపై కేవలం 5.98% మాత్రమే ఖర్చు చేస్తున్నారని, బీహార్ (20.27%), ఢిల్లీ (24.26%), రాజస్థాన్ (12.11%) వంటి రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం చాలా వెనుకబడి ఉందని రాకేష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పేదింటి బిడ్డలు కూడా కార్పొరేట్ స్థాయిలో చదువుకోవాలనే ఉద్దేశంతో 1,000 గురుకులాలను ఏర్పాటు చేసి 6 లక్షల మందికి నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు తెచ్చి విదేశాల్లో చదువుకునే అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ఉన్న పాఠశాలలను బలోపేతం చేయాల్సింది పోయి.. 27 వేల బడులను కేవలం 4 వేలకు కుదిస్తామనడం సిగ్గుచేటని, ఇది ప్రభుత్వ విద్యను సమాధి చేయడమేనని విమర్శించారు. ఉపాధ్యాయులతో రోడ్డెక్కి ప్లకార్డులు పట్టుకునే దుస్థితిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను క్లియర్ చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని,



సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తేవాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక రాష్ట్రంలో ఇప్పటికే 23 మంది రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు చనిపోవడం బాధాకరమన్నారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, జీవో 317 సవరణతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నిరంతరం కొనసాగుతున్న అన్నదానం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యన్నదాన కార్యక్రమం నిరంతరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా గురువారం 773వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జవ్వాజి రామ్ కిషన్ రావు గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సహకారంతో పాటు, శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ - జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్), సంవత్సర దాతలు తోట లక్ష్మి, కూరగాయల మధు - మమత దంపతుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో, పట్టణ పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్తులు, యాచకులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లను అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు తోట లహరి తెలిపారు. ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాలకు తమ వంతు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలనుకునే దాతలు 8919376459 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ సేవా కార్యక్రమంలో జవ్వాజి రామ్ కిషన్ రావు కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు తోట లహరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.